సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు చేయూత

శామీర్ పేట : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు చేయూతనిస్తుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మంగళవారం అలియాబాద్‌కు చెందిన బాలమణికి మంజూరైన రూ.25,500 చెక్కును ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలెవరైనా అనారోగ్యానికి గురైతే ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శామీర్‌పేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి, తాళ్ల జగదీష్‌గౌడ్, మేడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన ఉపకరణాల ప్రదర్శన



కీసర: చీర్యాలలోని మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ జమదగ్ని ఆధ్వర్యంలో బోధనోపకరణాల ప్రదర్శన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జమదగ్ని మంగళవారం మాట్లాడుతూ.. విద్యార్థులకు చక్కని బోధనోపకరణలతో బోధించడం అనేది ఓ కళ అని, ఆ కళ ఉన్న వారే ఉపాధ్యాయులుగా రాణిస్తారన్నారు. కీసర మండలం నుంచి జిల్లాస్థాయిలో మంచి పేరు తీసుకొచ్చి మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. విజయకుమారస్వామి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, జగన్‌మోహన్, భానురేఖ, ఆర్‌పీలు రవీందర్‌రెడ్డి, యాదగిరి, అశోక్, సతీష్, జంగయ్య, అనురాధ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత మహేంద్రకు నివాళి



నివాళులర్పిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు కేఎల్.మహేంద్ర 18వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు ఆళవందార్ వేణుమాధవ్, బంగారి రాజయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రతాప్‌సింగ్, రఫీక్, మీరాప్రసాద్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని..

- డబ్బులు కాజేసిన వ్యక్తి రిమాండ్
- సుమారు రూ.1.50 కోట్ల టోకరా

మేడిపల్లి: డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పలువురి పేదలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అమృతకాలనీలో నివాసం ఉంటున్న నాగరాజు(45)తాను డబుల్‌బెడ్రూం కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని చెప్పాడు. పలువురు రాజకీయ నాయకులు తెలుసునని సుమారు 100 మందికి పైగా ఇళ్లులేని పేదలకు ప్రతాప్ సింగారంలో నిర్మించిన డబుల్‌బెడ్రూంలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున సుమారు రూ.1.50 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసి ఇళ్లు ఇప్పించకపోగా.. మాయమాటలతో కాలయాపన చేస్తూ.. తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో బాధితులు మోసపోయామని గ్రహించి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ చదువరులతోనే సాధ్యం

ఉప్పల్: ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ చదువరులతోనే సాధ్యమవుతుందని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎండీ. రియాజ్ అన్నారు. విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం, సాంస్కృతిక వారసత్వం పరిరక్షణ, సామాజిక సేవాభావం పెంపొందుతాయన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ తెలుగు, గ్రంథాలయ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. డిజిటలీకరణ, కృతిమమేథకి పెద్దపీట వేసే గ్రంథాలయాలు నేడు అత్యవసరమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, వాటిని భవిష్యత్తుకు దిక్సూచిగా వాడుకోవాలని సూచించారు. డా. తిరుపతయ్య, విశ్వనాథ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో..



మైసమ్మగూడలో నిర్మాణంలో భవనం



అక్రమ నిర్మాణాలపై నజర్ !

తూంకుంటలో 40 మంది నిర్మాణదారులకు నోటీసులు

మిగతా పురపాలికల్లో చర్యలకు సిద్ధం | చట్టపరమైన చర్యలపై యంత్రాంగం యోచన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాలపై జిల్లా అధికార యంత్రాంగం కన్నెర్ర చేస్తోంది. పురపాలికల్లో విలీనమైన పాత పంచాయతీల పరిధిలోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు అధికంగా ఉన్నట్లు గుర్తించిన ఆయా మున్సిపల్ కమిషనర్లు చర్యలకు సిద్ధమవుతున్నారు.

షోకాజ్ నోటీసులు..

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో 40 అక్రమ కట్టడాలను గుర్తించిన కమిషనర్ జ్యోతి సంబంధిత యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని కరీంనగర్ జాతీయ రహదారికి ఇరువైపుల ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో అక్రమంగా నిర్మించిన వాణిజ్య, వ్యాపార సముదాయాలపై పుర యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు రావడంతో నోటీసులు అందజేసిన అధికారులకు రాజకీయ పెద్దల నుంచి ఒత్తిళ్లు పెరిగినట్లు తెలుస్తోంది.

హైడ్రాకు నివేదిక..

అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు నివేదిక అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడిముబ్బడిగా డ్రైనేజీ కాలువపై అక్రమంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు నిర్మించినట్లు జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందాయి.

◆ పోచారంలో విలీనమైన పాత చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారి వెంట ఇరువైపుల అక్రమంగా వ్యాపార, వాణిజ్య భవనాలు వెలిశాయి. ఈ అక్రమ కట్టడాలపై స్థానికులు పుర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. రహదారి పక్కన ఉన్న డ్రైనేజీ కాల్వలను కాపాడాలని, లేదంటే జాతీయ రహదారి వర్షాలు కురిసినప్పుడు జలమయంగా మారుతుందని పేర్కొన్నారు.

అధికారుల చేతివాటం..

మున్సిపాలిటీ పరిధిలో పలువురి ఉద్యోగుల చేతివాటం నిర్వాకం వల్లే అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్ల పోచంపల్లితో సహా కొత్తగా మున్సిపాలిటీలుగా వెలిసిన ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి పరిధిలోని పాత గ్రామపంచాయతీల్లో కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

◆ జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట్‌తో సహా కొంపల్లి, దుండిగల్ పురపాలక సంఘాల్లో కూడా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేని వాటిపై..

శివారు పురపాలక సంఘాల్లో అనుమతులు లేని ఇళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాల గుర్తింపు ప్రక్రియపై పురపాలక సంఘాలు దృష్టి సారించాయి. జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలు, బహుళ అంతస్తులు, వ్యాపార వాణిజ్య సముదాయాల జాబితా తయారీపై ఆయా మున్సిపల్ కమిషనర్లు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వచ్చిన 1.68 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తే, 16 పురపాలక సంఘాల పరిధిలో అనుమతి లేని భవనాలు, వ్యాపార సముదాయాలు ఎన్ని.. ? ఉన్నాయన్న విషయం అట్టే విధిమవుతోంది.

నాలుగింటికి ఒక్కడే టౌన్‌ప్లానింగ్ అధికారి..

తూంకుంట టౌన్‌ప్లానింగ్ అధికారి దేవరకొండతో సహా ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలకు కూడా ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇదే పరిస్థితి మిగతా 12 పురపాలక సంఘాల్లో కూడా నెలకొంది. దీంతో టౌన్ ప్లానింగ్ వ్యవస్థను కమిషనర్లు ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నట్లు స్థానికులు, పలు స్వచ్ఛంద సంస్థలు , ప్రజా సంఘాలు, సమాచార హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. చెరువులు,కుంటలు, మురికి కాల్వలు, రోడ్లతో సహా ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలను నిర్మించినా.. రెవెన్యూ, పుర, ఇరిగేషన్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టినా జిల్లా కలెక్టర్ మనుచౌదరి పురపాలక సంఘాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నేటి నుంచి 15 వరకు భారీ వర్షాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరంలో వచ్చే 3 రోజులు, నేటి నుంచి 15 వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణశాఖ హెచ్చరికకు అనుగుణంగా హైదరాబాద్‌లోని ఉత్తర ప్రాంతాలు (మేడ్చల్ జిల్లా, సైబరాబాద్ ప్రాంతం మొదలైనవి) ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. 10/15 సెం.మీ. కంటే ఎక్కువ, కొన్నిచోట్ల 20 సెం.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వాహనాల రాకపోకలను తగ్గించుకోవాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంబంధిత శాఖలు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

మేడ్చల్‌లో టీఎంపీఎస్ ఆవిర్భావసభ



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

మేడ్చల్‌రూరల్: అన్ని ముదిరాజ్ సంఘాలు ఐక్యతతో ముందుకుసాగితేనే హక్కులు జాతి హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేతలు నీలం మధుముదిరాజ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్‌హాల్‌లో మంగళవారం తెలంగాణముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావసభలో ఆయన పాల్గొని టీఎంపీఎస్ లోగోను ఆవిష్కరించారు. ముదిరాజ్ హక్కుల కోసం పోరాడిన మహానేత స్వర్గీయ ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. 25 మంది పీహెచ్‌డీ స్కాలర్స్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. అన్ని సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించుకుని అందరి సలహాలు, సూచనలతో ముందుకు సాగుదామని పిలుపు నిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్ కులాన్ని బీసీ డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చుతామని హామీ ఇచ్చిందని, ముదిరాజ్‌ల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజ్‌లు తరలివచ్చారు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- శిక్షణ ముగింపులో డీఈఓ విజయ కుమారి
- రెండు రోజుల శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ టీచర్లు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆడపిల్లలు కేవలం చదువుపైనే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అన్నారు. బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా విద్యాశాఖ, హైదరాబాద్ ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని జెడ్పీఎచ్ఎస్ (బాలురు)లో జిల్లా పరిషత్, ఉన్నత, పాఠశాలల ఉపాధ్యాయులకు రెండ్రోజులు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ.. వారి జీవితాలతో ఆడుకుంటున్నారని డీఈఓ ఆవేదన వ్యక్తం చేశారు. మంచి ఫలితాలు సాధించిన పిల్లలను అభినందించి, ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలో చైల్డ్ గ్రూప్స్ ఏర్పాటు చేసి సమస్యలను రిపోర్ట్ చేసేలాగా ప్రోత్సహించాలని సూచించారు.

◆ మొబైల్ నిత్య జీవితంలో భాగమైందని, దీన్ని వాడటం ద్వారా వచ్చే నష్టాలతో సహా సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నిజమైన వార్తలను వారికి వివరించి దాని నుంచి బయటపడేలాగా మోటివేషన్ చేయాలన్నారు. పిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 లాంటి టోల్ ఫ్రీ నంబర్లను ఉపయోగించాలని సూచించారు. హైదరాబాద్ ప్రజ్వల సీనియర్ కో- ఆర్డినేటర్ సురేష్‌కుమార్, డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 32 వేల మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు. మోసం చేసి పిల్లలను బిక్షాటన, సర్కస్, ఇంటిపనులు, చైల్డ్ లేబర్, గాజుల తయారీలో ఉపయోగిస్తున్నారన్నారు. లైంగిక వ్యాపారంలో ఎక్కువగా యుక్త వయసున్న అమ్మాయిలను ఉపయోగిస్తున్నారన్నారు. ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసం చేస్తున్నారన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కో- ఆర్డినేటర్ అంబర్‌సింగ్, రిసోర్స్ పర్సన్ రజిని, గాయత్రి, మేడ్చల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై కేసు

పోచారం: రోడ్డు కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడలోని ఓయూ కాలనీలో రోడ్డును కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులకు అదే కాలనీకి చెందిన రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కబ్జాదారులు అతడిని బెదిరిస్తున్నారు. స్థానిక అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రాజశేఖర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు కబ్జాదారులపై పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగి ఆత్మహత్య

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని విజయలక్ష్మి ఇన్ఫోసిటీ, ఫ్లాట్ నెంబర్ 204లో చిగురాల మణి (28), శివాణి దంపతులు నివాసం ఉంటున్నారు. కాగా వీరి వివాహం ఈ ఏడాది మార్చిలో జరిగింది. వీరు నివసిస్తున్న ఫ్లాటును లోన్‌పై కొనుగోలు చేశారు. ఇంటి రుణం ఎలా తీర్చాలోనని భర్త తరచుగా బాధపడుతూ ఉండేవాడు. ఈనెల 8న వరలక్ష్మి వ్రతం సందర్భంగా దంపతులిద్దరూ కలిసి హబ్సిగూడలోని శివాణి తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. భార్య శివాణిని అక్కడే ఉంచిన భర్త అన్నోజిగూడకు తిరిగొచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలోని బంధువులు భార్యకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆమె మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కీసరలో సంకటహర చతుర్థి పూజలు



కీసర: శ్రావణమాసం సంకటహర చతుర్థి సందర్భంగా కీసరగుట్టలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని గణపతికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

బంగారు భవిష్యత్తు మీ చేతుల్లోనే !

జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

మేడ్చల్‌రూరల్: మీ కలలను నిజం చేసుకుని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం మీ చేతుల్లోనే ఉందని, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మంగళవారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలలను సాకారం చేసుకునేందుకు, లక్ష్యాన్ని ఏర్పరచుకుని అందుకు క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా కార్యాచరణతో కష్టపడి చదవాలన్నారు. అందుకు అవసరమైన అన్నివిధాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. విద్యార్థులను వారి సబ్జెక్టుల గురించి అడిగి తెలుసుకుని, అవసరమైన మార్గనిర్దేశ సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందిస్తున్నారా.. ? స్కూల్, కాలేజ్‌లో సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులు కంప్యూటర్లు, ల్యాబ్ కావాలని తెలపగా.. అదనపు కలెక్టరు తప్పకుండా సమకూర్స్తామని హామీ ఇచ్చారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాలతో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు



కీసరలో..

కీసర: కీసర మండల బీజేపీ అధ్యక్షుడు కోల బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, శ్రద్ధ గ్రూప్స్ ఆఫ్ కాలేజీ సహకారంతో మంగళవారం కీసరలో 100 మీటర్ల తిరంగా జెండాతో ర్యాలీ నిర్వహించారు. కీసర పురవీధుల్లో దేశభక్తి గీతాలతో ర్యాలీ చేపట్టారు. బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు అశోక్‌ముదిరాజ్, శ్రీనివాస్‌రావు, కృష్ణయాదవ్, సంపత్‌యాదవ్, నాగేష్‌ముదిరాజ్, కృష్ణ, జంగయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శాలిని తదితరులు పాల్గొన్నారు.

రావల్‌కోల్‌లో..

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి రావల్‌కోల్ గ్రామంలో మంగళవారం బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో 75 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



ఘట్‌కేసర్‌లో సంఘీభావం తెలుపుతున్న శోభారాణి, మహిపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయంలో హిందూ సంఘాలు పిలుపునిచ్చిన సందర్భంగా కుంకుమార్చనకు తరలి వెళ్తున్న హిందూ సంఘాల నాయకులను ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. బీజేపీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌ముదిరాజ్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ ప్రసాద్‌తో పాటు పలువురిని ఉదయం ముందస్తు అరెస్ట్ చేయగా.. పలువురు బీజేపీ నాయకులు పరామర్శించారు. పోలీస్‌సేషన్‌కు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. బీజేపీ సీనియర్ నేత రామోజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, వీరేశం, మధుసూదన్‌రెడ్డి, సురేష్, విజయ్, మాధవి, చంద్రకళ, పద్మ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన



చీర్యాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కీసర: వంద రోజుల కార్యాచరణలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ పుష్పలత ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల, కీసరలో తడి, పొడి వ్యర్థాల వేరుపై అవగాహన కల్పించారు. గృహ కంపోస్టింగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. కీసర ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

శామీర్‌పేట : వినాయకమండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ప్రజలతో వినాయకమండపాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకమండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, తీగలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వినాయకచవితి పండగను ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతల మధ్య నిర్వహించుకోవాలన్నారు. పోలీసుల సహకారం ఎల్లప్పుడూ.. ఉంటుందని ఏదైనా ఇబ్బందులు ఉంటే శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌ను నేరుగా సంప్రదించాలని లేదా 100కు డయల్ చేయాలని స్పష్టం చేశారు. ఎస్సైలు దశరథ, శశివర్ధన్‌రెడ్డి, ఉమ్మడి శామీర్‌పేట మండలం మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లేని షాప్‌లపై ప్రత్యేక డ్రైవ్

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లో ట్రేడ్ లైసెన్స్‌లేని దుకాణాలపై కమిషనర్ వసంత ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీనగర్‌లో ట్రేడ్ లైసెన్స్ లేని బాలాజీ వైన్స్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వసంత మాట్లాడుతూ.. వ్యాపారులు వారి దుకాణ సముదాయాలకు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లేదంటే మున్సిపల్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి రావల్‌కోల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి మహనీయులు, పోరాట యోధులు, జాతీయ నాయకుల జీవితచరిత్ర పుస్తకాలను స్కూల్ హెచ్ఎంకు అందజేశారు. బీజేపీ నేతలు శ్రీశైలంయాదవ్, జగన్‌గౌడ్, నాగరాజు, శోభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.